సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం ¦ 28 ¦ ఆగస్టు ¦ 2024



తగ్గేదేలే..! - 8లో

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మహిళా రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగా వ్యవసాయ పరిశ్రమ, పాడి పరిశ్రమలో వారి పాత్ర నానాటికీ పెరుగుతోంది.



పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి

జిల్లాలోని అన్ని పరిశ్రమలు తమ సంస్థల్లో భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. - 8లో



సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలి - 8లో

గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపీడీఓలను ఆదేశించారు.

వైద్యులకు భద్రత పెంచాలి



ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు, వైద్య సిబ్బందికి భద్రత పెంచాలి. కాల్ డ్యూటీకి వచ్చే వైద్యులకు మరుసటి రోజు డే ఆఫ్ ఇవ్వాలి. డ్యూటీ రూమ్‌కు అనుబంధంగా టాయిలెట్స్ ఉండేలా ఏర్పాటు చేయాలి. స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే వాతావరణం కల్పించాలి.

– డాక్టర్ కె.పద్మలీల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

సెక్యూరిటీ అవసరం



అత్యవసర విభాగం వద్ద సెక్యూరిటీని పెంచాలి. ఒక రోగితో నలుగురు, ఐదుగురు బంధువులు వస్తారు. వైద్యం చేసినా వైద్యం చేయలేదని వాదిస్తారు. అలాంటి సమయంలో ఎటువంటి గొడవలు లేకుండా భద్రత ఎక్కువగా ఉండాలి.

– ఐశ్వర్య, వైద్యురాలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

కఠినంగా శిక్షించాలి



వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిపై దాడులుచేసే వారిని కఠినంగా శిక్షించాలి. దాడి చేయాలంటే భయపడే విధంగా కఠిన చట్టాలు తీసుకురావాలి. ప్రేమగా రోగులకు సేవలందించే తమకు అందరూ సమానమే. అందరికీ ఒకే విధంగా సేవలు అందిస్తాం.

– పి.గీతారాణి, స్టాఫ్‌నర్స్, వైఎస్సార్ నగర్ యూపీహెచ్‌సీ



న్యూస్‌రీల్

29న మెగా దంత వైద్యశిబిరం

పార్వతీపురంటౌన్: జిల్లా పింఛన్‌దారుల సంఘం సౌజన్యంతో వరుణ్ డెంటల్ వారు ఈ నెల 29న మెగా దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి గణపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్వతీపు రం మన్యం జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ, ఏపీఈపీడీసీఎల్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు అర్హులని, ఈహెచ్‌ఎస్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వన్నాంలో ఏనుగుల తిష్ట

- ఆందోళనలో నాగావళి పరీవాహక ప్రాంత ప్రజలు



వన్నాంలోని తోటల్లో తిష్ట వేసిన ఏనుగులు

కొమరాడ: గడిచిన ఐదేళ్లగా గజరాజుల బాధలు మండలాన్ని వీడడం లేదు. ఇటీవల జియ్యమ్మవలస మండలంలోని పలు గ్రామాల్లో సంచరించిన ఏడు ఏనుగుల గుంపు కొమరాడ మండలంలోని వన్నాం గ్రామ సమీపంలోకి చేరుకుంది. ఈ నేపథ్యంలో నెలరోజుల క్రితం పిల్ల ఏనుగుకు జన్మనిచ్చాయి. ఈ నేపథ్యంలో నాగావళి నది దాటేందుకు ఇబ్బందులు పడుతున్న గజరాజుల గుంపు భయందోళనతో సోమవారం వన్నాం గ్రామానికి చెందిన వాన శివున్నాయుడిని హతమార్చాయి. దీంతో సమీప కిచ్చాడ, ఈదలవలస, చెక్కవలస, మాదలింగి, పాలెం తదితర గ్రామాల ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నాగావళి నది పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రతగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గజరాజులు సంచరిస్తున్న ప్రాంతంలో అటవీశాఖ ట్రాకర్స్ నిఘా వేశారు. రైతులు ఒంటరిగా పొల్లాల్లోకి వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఏనుగుల సమాచారం తెలుసుకుని పొల్లాల్లోకి వెళ్లడంతో పాటు రాత్రి పూట కురుపాం నుంచి ఆయా గ్రామాలకు ప్రయాణిస్తే సమాచారం అడిగి వెళ్లాలని కోరుతున్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసును సీతంపేటలోనే కొనసాగించాలి



ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సీతంపేట ఆదివాసీ జేఏసీ నాయకులు

వీరఘట్టం: సీతంపేటలో ఉండే విద్యాశాఖకు సంబంధించిన ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసును శ్రీకాకుళానికి తరలించడంతో తామంతా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆదివాసీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసును సీతంపేటలోనే కొనసాగించాలని కోరుతూ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు మంగళవారం వారంతా వినతిపత్రం అందజేశారు. వీరఘట్టం మండలంలోని ఎం.రాజపురంలో గల ఆయన స్వగృహంలో వారంతా కలిసి విద్యాశాఖలో పనిచేస్తున్న గిరిజనులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వంతో మాట్లాడి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

1800 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో పోలీస్ సిబ్బంది

వీరఘట్టం: మండలంలోని చిన్నగోర శివారు ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కళాధర్ సిబ్బందితో మంగళవారం సారా బట్టీలపై దాడులు చేశారు. పోలీసులు వస్తున్నారనే సమాచారం తెలియడంతో సారా తయారీదారులు పరారయ్యారు.సంఘటనా స్థలంలో తయారు చేసిన ఉంచిన 1800 లీటర్ల సారాను ధ్వంసం చేసి 9 డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.


గెంటివేత..!



మేమేమి చేశాము నేరం..మాకెందుకు ఈ శిక్ష..అంటూ కన్నీరు పెడుతున్నారు చిరుద్యోగులు. తుమ్మితే ఊడిపోయే ఉద్యోగాలు వారివి. చాలీచాలని వేతనాలైనా..ఏదో సర్కారు కొలువన్న చిన్న ఆశ. ఉన్న దాంట్లోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జీతాలు అందుకుంటున్నా.. ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు ఊడుతుందో తెలియని దుస్థితి. అందుకే..ఎవరేమన్నా, తలవంచుకుని తమ పని తాము చేసుకుని వెళ్లిపోతారు. అటువంటి వారి మెడ మీద కొంత కాలంగా కత్తి వేలాడుతోంది. ఉదయం కార్యాలయానికి వెళ్లింది మొదలు.. తిరిగి ఇంటికి వచ్చే వరకూ గుండెల్లో గుబులే. ఏ సమయంలో ఏ కారణంతో విధుల నుంచి తప్పుకోమంటారో అన్న బెంగే. ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ విభాగాల్లో ఒప్పంద, పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల దుస్థితి ఇది. ఎక్కువగా పొరుగుసేవల ఉద్యోగులే బలైపోతున్నారు.

-సాక్షి, పార్వతీపురం మన్యం

- రాజకీయ ఒత్తిళ్లతో చిరుద్యోగులపై వేటు
- విధుల నుంచి తొలగింపు
- పలు ప్రభుత్వ విభాగాల్లో ఇదే పరిస్థితి
- ఇప్పటికే అయోమయంలో వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు
- అల్ప జీవులపై..అంత కక్ష ఎందుకంటూ బాధితుల ఆవేదన



పార్వతీపురం మన్యం జిల్లాలో పలు ప్రభుత్వ విభాగాల్లో శాశ్వత ఉద్యోగాల భర్తీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదికనే ఉద్యోగులను తీసుకుంటున్నారు. దాదాపు 40 వరకు ప్రభుత్వ శాఖలు ఉండగా..వైద్యారోగ్యం, సర్వశిక్ష, విద్య, ఐసీడీఎస్, వెలుగు, డ్వామా, పురపాలక సంఘాలు, పౌరసరఫరాలు, రెవెన్యూ, పీఆర్..ఇలా పలు శాఖల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కేజీబీవీలు, ఇతర విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది, వెలుగులో సీసీలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల వంటి పోస్టులు ఉంటున్నాయి. ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఆయా విభాగాల్లో ఖాళీలు ఏర్పడినప్పుడల్లా నియామకాలు జరుగుతుంటాయి. వారికి సకాలంలో జీతాలు కూడా అందవు. నెలల తరబడి పెండింగ్‌లో ఉంటాయి. పొరుగుసేవల విభాగంలో పని చేస్తున్న వారిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి.. ఆప్కస్‌లో చేర్చి, ప్రతి నెలా రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి జీతాలు అందించేది. వీరు ఏ పార్టీకీ అనుకూలం కాకపోయినప్పటికీ.. ఫలానా వారి హయాంలో నియామకమయ్యారన్న సాకు చూపి నేడు కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి..విధుల నుంచి తొలగిచేస్తూ చిరుద్యోగుల పొట్ట కొడుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడింది మొదలు..

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది మొదలు..జిల్లాలో పొరుగుసేవల ఉద్యోగులు, రోజువారీ వేతనంపై పని చేసేవారికి దినదిన గండంలా పరిస్థితి మారింది. వారిని కేవలం రాజకీయ కక్షతో కేవలం నోటి మాట ద్వారానే విధుల నుంచి తొలగించేలా ఒత్తిడి చేస్తున్నారు. దానికి అధికారులు కూడా వంత పాడుతూ ఆ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. వారి స్థానంలో అధికార పార్టీకి చెందిన వారిని నియమించుకుంటున్నారు.

పార్వతీపురం పురపాలక సంఘంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్న పి.సుమ అనే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగినిని ఇటీవల అకారణంగా తొలగించారు. కొన్నిరోజులుగా ఆమెకు సీటు ఇవ్వక, ఏ పనీ చెప్పక వేధిస్తూ వచ్చి..చివరికి విధుల నుంచి తొలగించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బంధువు కావడమే ఆమె చేసిన నేరంగా తెలుస్తోంది.

'ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులపైనా రాజకీయ వేధింపులు అధికమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో వీరు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్న ముద్ర వేస్తూ.. తొలగించేందుకు పాల్పడుతున్నారు. కురుపాం నియోజకవర్గంలో ఈ తరహా సంఘటనలు ఎక్కువగా కనిపిస్తుండగా.. ఇటీవల పలువురు బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడును అధికారులకు మొరపెట్టుకున్నారు.

చివరికి స్వీపర్లను కూడా..

'కేజీబీవీల్లో పని చేస్తున్న చిరుద్యోగులపైనా వేటు తప్పడం లేదు. పాచిపెంట కేజీబీవీలో పని చేస్తున్న కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, రాత్రి కాపలాదారు, మక్కువ కేజీబీవీలోని స్వీపర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, కొమరాడ విద్యాలయంలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, రోజువారీ వేతనం కింద పని చేస్తున్న కుక్‌లను అకారణంగా తొలగించారు. 'పాచిపెంట, జియ్యమ్మవలస, కొమరాడలతోపాటు, పలు మండలాల్లో పాఠశాలల స్వీపర్లను విధుల నుంచి తప్పించారు. వెలుగులో పని చేస్తున్న సీసీలను అకారణంగా తొలగిస్తున్నారు. వారిలో అధికశాతం మంది పురుషులే కాగా..మహిళలే ఉండాలన్న నిబంధన చూపుతూ వేటు వేయిస్తున్నారు.

గాలిలో ఎండీయూ ఆపరేటర్లు

'మరోవైపు జిల్లాలో 196 మంది ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికీ రేషన్ పంపిణీ ప్రక్రియలో భాగమయ్యేవారు. ప్రభుత్వం ఈ విధానాన్నే రద్దు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు వారి భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారింది.

విచిత్రంగా వలంటీర్ల పరిస్థితి

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గత ప్రభుత్వంలో నియమితులైన గ్రామ, వార్డు వలంటీర్ల పాత్ర ఎనలేనిది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని గత ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక.. వారిని గాలిలో ఉంచేశారు. సుమారు మూడు నెలలుగా వారికి వేతనాలు లేవు. ఏ పనీ అప్పగించడం లేదు. అసలు తమను కొనసాగిస్తారా, లేదా? అన్నది కూడా స్పష్టం చేయడం లేదు. జిల్లాలో 5,356 మంది వలంటీర్లు సేవలందించేవారు. వాస్తవానికి వారి కొనసాగింపు గడువు ఈ నెల 14తో ముగిసిపోయింది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులూ రాలేదు. దీంతో వారు ఈ నెల 31 నుంచి 'వలంటీర్ల నివేదన' కార్యక్రమానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ వేధింపులతో తొలగింపు తగదు

ఏ ప్రభుత్వం వచ్చినా చిరుద్యోగులను బలిపశువులను చేయడం భావ్యం కాదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ వేధింపులతో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు, డైలీవేజ్ వారిని తొలగించడం ఎంత వరకు సమంజసం? అభ్యంతరాలు, తప్పులు ఉంటే నోటీసులు ఇవ్వాలి గానీ అక్రమంగా తొలగించడం సరైంది కాదు. పలు విభాగాల్లో తొలగించిన ఉద్యోగులతో కలిసి ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు అందించాం. భవిష్యత్తులో బాధిత ఉద్యోగుల తరఫున ఆందోళనలు, పోరాటాలు చేస్తాం.

– రెడ్డి వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ

ప్రజలకు ఆరోగ్యభరోసా కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తక్షణ చర్యలు
- ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేయాలి
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



హాజరైన ప్రజాప్రతినిధులు

విజయనగరం: సీజనల్ వ్యాధులను అరికట్టి ప్రజల ఆరోగ్యానికి భద్రత, భరోసా కల్పించాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు ఉమ్మడి విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. జిల్లాలో మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తక్షణమే అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం జరిగాయి. 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన, 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్ చైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం ఆ సంఘ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఆయా సంఘాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ప్రజారోగ్యానికి భరోసా ఇవ్వాలి

సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ముందుగా వైద్యారోగ్యశాఖపై చర్చ జరిగింది. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బట్లభద్ర గ్రామంలో ఇటీవల తల్లీకూతుళ్లు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇది చాలా దారుణమైన ఘటనగా పేర్కొన్నారు. ఇటీవల జిల్లాలో సైన్‌ఫ్లూ కేసు కూడా నమోదైందని, వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలకు వెళ్తే పై ఆస్పత్రులకు రిఫర్ చేసేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. రెండు జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చేలా వైద్యసేవలు అందించాలని సూచించారు.

☛ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ డెంగీ, మలేరియా, విషజ్వరాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీజనల్ వ్యాధుల విజృంభనకు కారణాలను కనుక్కొని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. పీహెచ్‌సీల్లో మందులు నిల్వ ఉంచడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యులను కోరారు.

☛ విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభించకముందే, వాటిని అరికట్టేందుకు చర్యలను తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కరువైందని ఆరోపించారు. వ్యాధుల విజృంభణకు కారణాలను ఇతర శాఖలపైకి నెట్టేందుకు ప్రయత్నించడం తగదన్నారు. ఆస్పత్రుల్లో ఒకే పడకపై ఇద్దరు రోగులను ఉంచే పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. వసతి చాలకపోతే తమ దృష్టికి తీసుకువస్తే ప్రత్యామ్నాయం చూపేవారమని చెప్పారు.

☛ ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. మంకీ ఫాక్స్ వ్యాధి కూడా వ్యాప్తి చెందుతోందన్నారు. గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు.

☛ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన జరిగిన 3వ స్థాయీ సంఘ సమావేశంలో వ్యవసాయ పరిస్థితిపై చర్చించారు. విజయనగరం జిల్లాలో బొండపల్లి, గజపతినగరం, విజయనగరం, గంట్యాడ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యిందని, ఉబాలు పూర్తి కాలేదని తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారం వరకు ఉబాలకు అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించాలని, వెద జల్లేందుకు విత్తనాలను సిద్ధం చేయాలని జెడ్పీ చైర్మన్ వ్యవసాయ అధికారులకు సూచించారు. కౌలు రైతులందరికీ రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. రైతులకు పంట బీమా సదుపాయం కల్పించాలని కోరారు. ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి కోరారు. డీఆర్‌డీఏ, పౌర సరఫరాల శాఖపై చర్చించారు.

☛ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన మహిళా శిశుసంక్షేమంపై చర్చ జరిగింది. జిల్లాలో ఎన్‌జీఓల ఆధ్వర్యంలో 43 అనాథ శరణాలయాలు, బాలల వసతి కేంద్రాలు ఉన్నాయని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. వీటన్నింటినీ తనిఖీ చేసి, అక్కడ వసతి, భద్రతా ఏర్పాట్లపై నివేదికను అందజేయాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, రెండు జిల్లాల జెడ్పీటీసీ సభ్యులు, కమిటీ మెంబర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పీఎంవీవై రుణాలు

- రూ.2లక్షల వరకు రుణ మంజూరు అవకాశం
- టూల్ కిట్ కోసం రూ.15 వేలు ఇన్సెంటివ్
- జిల్లాలో అందిన 5,584 దరఖాస్తుల పునఃపరిశీలన
- చేతివృత్తులు, సంప్రదాయ వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన (పీఎంవీవై) పథకం కింద 18 రకాల కుల, చేతి, సంప్రదాయ వృత్తుల వారికి రూ.2 లక్షల వరకు రుణం అందజేయనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన పీఎంవీవై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన విశ్వకర్మ ఐడీ కార్డు కలిగిన వారికి 5 రోజుల ప్రాథమిక శిక్షణ అనంతరం రూ.15 వేలు విలువచేసే టూల్ కిట్‌ను ఇన్సెంటివ్‌గా అందజేస్తామని చెప్పారు. 5 శాతం వడ్డీతో మొదటి విడతగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని 18 నెలల్లో తీర్చాల్సి ఉంటుందన్నారు. విశ్వకర్మ పోర్టల్‌లో అందిన దరఖాస్తులు సచివాలయం పరిధిలో పరిశీలన అనంతరం అర్హత కలిగిన దరఖాస్తులను పునఃపరిశీలించారు. జిల్లా నుంచి 5,584 మంది రుణం కోసం దరఖాస్తు చేసినట్టు తెలిపారు. దరఖాస్తుదారు అదే వృత్తిలో కొనసాగుతున్నారా? లేదా? రుణానికి అర్హుడా? కాదా? అనే విషయాలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వరరావు, డీపీఓ శ్రీధర్‌రాజా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, మెప్మా పీడీ సుధాకర్‌రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ పెంటోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలన్నీ గిరిజనులకు చేరాలి

కేంద్ర ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం కల్పించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు ఆదేశించారు. పీఎంజన్‌మన్ కార్యక్రమం ప్రచారంలో భాగంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాల్లోని 53 గ్రామాల్లో చేపడుతున్న అవగాహన శిబిరాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ అనిత, గిరిజన సంక్షేమ అధికారి రామానందం తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల వివరాలు అందజేయాలి

- డీఎంహెచ్‌ఓ విజయపార్వతి



పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరాల వివరాలు అందజేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ పార్వతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదయ్యే సాధారణ జ్వరాలు, మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఇతర జ్వరాల సమాచారం తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి తెలియపరచాలని స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలు, అబార్షన్లు, కుక్క, పాము కాట్లతో పాటు వస్తున్న అన్ని కేసుల వివరాలు అందజేయాలని, అందించని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా, డెంగీ ఇతర జ్వరాల పరిస్థితి అదుపులోనే ఉందని. డెంగీ నిర్ధారణకు పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రి, పాలకొండ ఏరియా ఆస్పత్రి గుర్తింపు పొందాయని, కేవలం ఈ రెండు ఆస్పత్రుల్లో మాత్రమే డెంగీ నిర్ధారణ జరుగుతోందని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో గల అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లకు సర్క్యులర్ జారీ చేశామని పేర్కొన్నారు.

యోగా శిక్షకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఆయుష్ ఆరోగ్య మందిరంలో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా పోస్టు గ్రాడ్యుషన్, డిప్లమా చేసిన లేదా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పురుష శిక్షకులు నెలకు 32 గంటలు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఫోన్ నంబర్ 99591 42801ను సంప్రదించాలన్నారు.



సామూహిక పసుపు కొమ్ముల నోములో పాల్గొన్న మహిళలు

మహాలక్ష్మీ నమోస్తుతే..!

శ్రావణమాసం నాల్గువ మంగళవారం సందర్భంగా పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద 'మన ఆలయానికి మహాలక్ష్మి' పేరిట సామూహిక పసుపు కొమ్ముల నోమును దుప్పాడ శ్రీక్షేత్రం వేద పండితులు ఆధ్వర్యంలో నిర్వహించారు. 108 మంది సువాసినులు లక్ష్మి సహస్రనామ స్తోత్రములు పఠించారు. ప్రాజెక్టు చైర్మన్ పెంటపాటి ముత్యాలు, కన్వీనర్ కామరాజు, శ్రీక్షేత్రం ఆలయ ధర్మకర్త ఉమాబాలాజీ తదితరుల పర్యవేక్షణలో పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

– విజయనగరం



భక్తుల పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారు

క్లుప్తంగా

ఘనంగా గోపూజోత్సవం


గో పూజోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం గోకులాష్టమి పర్వదినం పురస్కరించుకుని గోపూజోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీటీడీ ప్రోగ్రామింగ్ మేనేజర్ జె.శ్యామ్‌సుందరం ఆధ్వర్యంలో అర్చకులు పీవీ నరసింహాచార్యులు గోపూజోత్సవాన్ని నిర్వహించారు. తిరుమల నుంచి వచ్చిన ప్రతినిధులు, శ్రీకాకుళం, విశాఖ నుంచి వచ్చిన ధర్మప్రచార పరిషత్ సభ్యులు, టీటీడీ ప్రతినిధులు ఎంకెవి.సత్యన్నారాయణ, సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.ప్రసాద్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి అలాహజరత్ ఉత్సవాలు

విజయనగరం టౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29 నుంచి 31 వరకూ అలాహజరత్ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు జిల్లా శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సున్నీ మసీదుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. స్థానిక అబాద్ వీధిలో ఉన్న మదరసా అల్ జామియాతుల్ హబీబియా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 9 గంటలకు అలా హజరత్ ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంతర్జాతీయ పోటీల న్యాయ నిర్ణేతగా జ్వాలాముఖి


కేవీ జ్వాలాముఖి

విజయనగరం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగే చెస్ పోటీలకు న్యాయ నిర్ణేతగా విజయగనరం జిల్లాకు చెందిన కేవీ జ్వాలాముఖి అర్హత సాధించారు. ఇటీవల తిరుపతిలో ఫిడే ఆర్బిటర్ సెమినార్‌లో నిర్వహించిన అర్హత పరీక్షలో పాల్గొన్న జ్వాలాముఖి అందులో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ కౌన్సిల్ ఆమోదంతో ఫిడే ఆర్బిటర్ టైటిల్‌ను అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఆయన చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ చెస్ పోటీల న్యాయ నిర్ణేతగా ఆయన ఎంపిక కావడం పట్ల చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శంకరరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేటకు చెందిన అంతరపల్లి శంకర్రావు(30) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తండ్రి ఫిర్యాదులో శంకర్రావు తరచూ భార్యతో గొడవలు పడి పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామగణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

850 మద్యం సీసాలు ధ్వంసం


మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

భోగాపురం: పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఇంతవరకు అక్రమంగా మద్యం తరలిస్తూ, బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్న 850 మద్యం సీసాలను మంగళవారం ధ్వంసం చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వుల మేరకు భోగాపురం స్టేషన్‌లో ఎస్ఈబీ సీఐ బీవీజీ రాజు, ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్ అధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



డ్యూటీ సమయంలో రక్షణ కల్పించాలి

డ్యూటీ సమయంలో ఎటువంటి ముప్పు లేకుండా మాకు రక్షణ కల్పించాలి. నిస్వార్థంతో సేవలు అందించినప్పటికీ కొంతమంది ఏదోరకంగా గొడవ చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ప్రతి వార్డులోను సెక్యూరిటీ, పోలీస్ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో ఉంచాలి.

– తిమ్మక ఉషారాణి, ల్యాబ్ టెక్నీషియన్, సర్వజన ఆస్పత్రి



కఠిన చర్యలు చేపట్టాలి

పాచిపెంట: వైద్యులు దేవుడితో సమానం అంటారు, అటువంటి వారిపై అమానుషంగా ప్రవర్తించేవారిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినచర్యలు చేపట్టాలి. వైద్యులను హత్య చేయడం చాలా దారుణం, ఆస్పత్రి ప్రాంగణంలో నిఘానేత్రాలను ఏర్పాటు చేయాలి, అలాగే మహిళా డాక్టర్లు విధులు నిర్వహించే ప్రాంతంలో పటిష్టమైన భద్రత విధిగా ఏర్పాటు చేయాలి.

– స్తుతి బండి, వైద్యాధికారిణి, గురువునాయుడు పేట పీహెచ్‌సీ



తగ్గేదేలే..!


రామభద్రపురంలో భర్తతో కలిసి కూరగాయలను మార్కెట్‌కు తీసుకువెళ్తున్న మహిళ


చిక్కుడు మొక్కలకు పురుగు నివారణ మందు పిచికారీ చేస్తున్న మహిళా రైతు

- మహిళా రైతులదే కీలక ప్రాత్ర
- వ్యవసాయ పనుల్లో భర్తలకు చేదోడు
- ఆర్థికాభివృద్ధిలో ప్రధాన భూమిక


వరి నారు తీస్తున్న మహిళా కూలీలు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మహిళా రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యక్షంగాను, పరోక్షంగా వ్యవసాయ పరిశ్రమ, పాడి పరిశ్రమలో వారి పాత్ర నానాటికీ పెరుగుతోంది. రామభద్రపురం మండలంలో దాదాపు 70 శాతం మంది మహిళలే రైతులు, రైతు కూలీలు. వారు భూమిని సాగుకు సిద్ధం చేసే దగ్గర నుంచి విత్తనాలు నాటి, పంటలను మార్కెట్‌లో విక్రయించేంతవరకు అన్ని పనుల్లోనూ అధికంగా కష్టపడుతున్నారు. పంటల సాగులో ఉన్న కలుపు తీయాలన్నా, కూరగాయ పంటలైతే మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నా, మహిళా రైతులు, రైతు కూలీలే ఉండాలి. వ్యవసాయ రంగం, పాడి రంగంపై ఆధార పడి జీవనం సాగిస్తూ ఆర్థికాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న వారిలో మహిళా రైతులు, రైతు కూలీలే ఎక్కువ. భర్తతో సమానంగా తెల్లవారు జామున పొలం పనికి వెళ్లి కూరగాయలు, వరి, పత్తి, పాడి వంటి పంటలలో పనులు చేసుకుని ఇంటికి వచ్చి వంట చేసి, పిల్లలను పాఠశాలలకు సిద్ధం చేసి పంపిస్తారు. మళ్లీ భర్తతో కలిసి పొలం పనులకు వెళ్లిపోతారు. మండలంలో ఉన్న వ్యవసాయ భూమిలో 60 శాతం వరకు మహిళలే స్వయంగా సాగు చేస్తున్నారు.ఉన్న చిన్నచిన్న కమతాలతోను, ఒకటి లేక రెండు పాడి ఆవులతోను ఆర్థికంగా అబివృద్ధి చెందుతూ పిల్లల చదువుల దగ్గర నుంచి ఆడపిల్లలకు పెళ్లి చేసేంత వరలకు మహిళా రైతులదే కీలక పాత్ర. పాడి పశువులు ఉంటే పశుగ్రాసం సేకరణ నుంచి పాలు పితికి పాల సొసైటీకి సరఫరా చేసినంతవరకు పరుషులే కాదు మేము కూడా వ్యవసాయ, పాడి రంగాల్లో దూసుకు పోగలం అని మహిళా రైతులు నిరూపిస్తున్నారు.


తారాపురంలో పాలు పితుకుతున్న మహిళా పాడి రైతు

పాడితో ఆర్థికంగా ఎదిగాం



గతంలో నాకు అర ఎకరా భూమి మాత్రమే ఉండేది.దాంతో పాటు రెండు ఆవులు ఉండేవి. ఎకరా భూమిలో పశుగ్రాసం సాగు చేసుకుంటూ, పాడి ఆవులను పెంచాం. పాలు సరఫరా చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాం. పాడి ఆవుల పాల ఆదాయంతోనే పిల్లలను చదివించుకుంటూ ఎకరా భూమి కొనుగోలు చేశాం. ఒక ఇల్లు కట్టుకున్నాం.

– ఆర్నిపల్లి ఈశ్వరమ్మ, మహిళా పాడి రైతు, నాయుడువలస.

వ్యవసాయంతోనే అబివృద్ధి చెందాం



వ్యవసాయంతోనే ఆర్థికాభివృద్ధి సాధించాం .గతంలో మాకున్న తక్కువ భూమిలో కూరగాయలు సాగు చేసేవాళ్లం, పిల్లలను చదివిస్తూ కుటుంబ జీవనం సాగించే వారం. వ్యవసాయం వల్లనే 2 ఎకరాల భూమి కొనుగోలు చేశాం. కుమార్తెకు వివాహం చేశాం.

– చొక్కాపు రాంబాయి, మహిళా రైతు, రామభద్రపురం

ప్రభుత్వ సహకారం లేదు



సొంత డబ్బులు పెట్టుబడి పెడుతూ పంటలు సాగు చేస్తున్నాం. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.15 వేలు వేసేది. ఆ డబ్బులు వ్యవసాయ పనులకు పెట్టుబడికి పనికొచ్చేవి. ఈ ప్రభుత్వం రూ. 20 వేలు ఇస్తామని చెప్పింది కానీ ఇప్పటికీ అతీగతి లేదు. ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నాం .పంటల సాగుకు ప్రభుత్వ సహకారం అందిస్తే మంచిది.

– చుక్క పైడితల్లి, కూరగాయల రైతు.రామభద్రపురం

ఇలా అన్ని రంగాలలో ఆరుగాలం కష్టపడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


చదురుగుడిలో పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు


దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పైడితల్లి అమ్మవారి దీక్షలను విస్తృతం చేయాలి: ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల నేపథ్యంలో దీక్షాపరుల సంఖ్యను పెంచేందుకు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు నేత్రత్వంలో శ్రీపైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, అచ్చిరెడ్డి, మహేష్‌లు మంగళవారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పైడిమాంబ దీక్ష పరమ పవిత్రమని, భక్తకోటికి ముక్తిదాయకమన్నారు. దీక్షలు చేపట్టే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రాతో పాటూ ఒడిశా, చత్తీస్‌ఘడ్ వరకూ ఇటువైపు విశాఖ, అన్నవరం, తుని, విజయవాడ వరకూ అన్ని మార్గాల్లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లు అంటించే కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.మహేష్, కె.రంజిత్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు

సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఎంపీడీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేయడంలో సరైన కార్యాచరణ ప్రణాళిక తయారుచేయాలని స్పష్టం చేశారు. లక్ష్య సాధన దిశగా పనితీరు ఉండాలని చెప్పారు. మండలాల్లో సమగ్రమైన డేటా తయారు చేయాలని సూచించారు. ఆరోగ్యం మెరుగుపరచడం, పౌష్టిక ఆహారాన్ని అందివ్వడం, సురక్షిత తాగునీరు అందించడం వంటి అంశాలు కూడా అభివృద్ధిలో భాగమని పేర్కొన్నారు. గ్రామ సచివాలయం సిబ్బం ది సేవలు సంతృప్తికర స్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఎక్కడా జరగరాదని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు కూడా పర్యవేక్షణ చేయాలని, ముఖ్యంగా తాగునీటి వసతులు, మౌలిక వసతులు ఉన్న ప్రదేశాల వద్ద నిర్దేశిత నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగరాదన్నారు. సమావేశంలో పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి వి.వెంకట రమణ, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, పార్వతీపురం, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు కె శ్రీనివాస్, ఎస్.సర్వేశ్వర రావు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రాయితీపై తుంపర సేద్యం పరికరాలు

తక్కువ నీటివనరులతో వ్యవసాయం చేసేందుకు గిరిజనులకు తుంపర సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పార్వతీపురం పరిధిలోగల గిరిజన సబ్ ప్లాన్ మండలాల్లోని గిరిజన రైతులకు తుంపర సేద్యం 2024–25 సంవత్సరానికి గాను రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో 750 మందికి గాను రూ. 53.79 లక్షలు నిధులు విడుదల చేశామని, ప్రతి రైతుకు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ తరపున చిన్న, సన్నకార రైతులకు (5 ఎకరాల లోపు) 55 శాతం రాయితీ, పెద్ద రైతులకు (5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల వరకు) 45శాతం రాయితీ ఇప్పటికే అందజేశామన్నారు. దీనికి అదనంగా ప్రతి గిరిజన రైతుకు రూ.7172లు ఐటీడీఏ తరపున రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పథకం పొందదలిచిన గిరిజన రైతులు సమీప రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలని లేదా ఫోన్ 7995009841 నంబర్(కేశవ్, స్ప్రింకర్స్ ఇంజనీర్)లో సంప్రదించాలని సూచించారు.

జీడి తోటలను పునరుద్ధరించాలి

గిరిజనులను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు జీడి తోటల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని ఉద్యానశాఖాధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖాధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 18 వందల ఎకరాల్లో జీడితోటల పునరుద్ధరణ కార్యక్రమం జరుగుతుందని, అందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం 500 ఎకరాలు, కురుపాం 540, జియ్యమ్మవలస 200, కొమరాడలో 160, సాలూరులో 200, మక్కువలో 100, పార్వతీపురంలో 100 ఎకరాల్లో చేపట్టాలని ఆదేశించారు.

'సెరికల్చర్'కు సిల్క్ సమగ్ర పథకం

సెరికల్చర్ రైతులు సిల్క్ సమగ్ర పథకాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మల్బరీ మొక్కల యూనిట్ ఖరీదు రూ.30 వేలు కాగా సిల్క్ సమగ్ర పథకం కింద ఎస్టీ,ఎస్సీ రైతులకు 90 శాతం, ఇతర వర్గాల రైతులకు 75 శాతం రాయితీ వస్తుందని చెప్పారు. సమావేశంలో ఉద్యాన, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ ఎస్.సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని పరిశ్రమలు తమ సంస్థల్లో భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఆయా భద్రతా ఏర్పాట్లను వారం రోజుల్లోగా పూర్తి చేసి అంతర్గత ఆడిట్ నివేదికను అందజేయాలని పరిశ్రమల యాజమాన్యాలకు స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలోని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఆయా పారిశ్రామిక యాజమాన్యాలతో కూడిన జిల్లా స్థాయి క్రైసెస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ సమావేశం ఫ్యాక్టరీల తనిఖీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ అంతర్గత ఆడిట్ పూర్తయినట్లు తెలియజేస్తే ఆయా పరిశ్రమలను జిల్లా స్థాయి అధికారులు, నిపుణులతో కూడిన కమిటీలు తనిఖీ చేసి నిర్ధారిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు భద్రత చర్యలు చేపట్టడంతోపాటు భద్రత చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి ఏవైనా ఘటనలు, ప్రమాదాలు జరిగినపుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమకూ ఏదైనా ప్రమాదం లేదా విపత్తు జరిగినపుడు తక్షణం ఎలా స్పందించాలి? ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న విభాగాలను గుర్తించి వాటి పనితీరు, నిర్వహణపై నిత్యం నిఘా పెట్టాలని సూచించారు. ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు భారీ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల్లో చేపట్టిన భద్రత చర్యలపై ఎస్ఎంఎస్‌ఫార్మా, హెచ్‌బీఎల్, మైలాన్ సంస్థల ప్రతినిధులు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డీడీ కోటేశ్వరరావు, ఆర్డీఓలు ఎంవీసూర్యకళ, బి.శాంతి, సుధారాణి, డిప్యూటీ లేబర కమిషనర్ సుబ్రహ్మణ్యం, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, ఏపీఐఐసీ అధికారులు మురళీమోహనరావు, రామకృష్ణ, అగ్నిమాపక అధికారులు, జిల్లాలోని వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణ దారుల సంక్షేమ సంఘం ఏకగ్రీవం

- బాధ్యతలు చేపట్టిన నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

విజయనగరం అర్బన్: జిల్లా చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సంఘం నూతన కమిటీ ఎన్నికల ప్రక్రియలో ఈ మేరకు నూతన కమిటీని ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కోటకు చెందిన బుగత వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గేదెల సత్యనారాయణ, గౌరవ సలహాదారుగా రామ్మూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఈ.రాజగోపాల నాయుడు, జిల్లా కార్యదర్శిగా పాలూరి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా అట్టాడ అప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సముద్రపు రామారావు, జిల్లా ముఖ్య సలహాదారుగా కుసుమంచి జగ్గయ్యశెట్టిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరి

పార్వతీపురంటౌన్:

జిల్లాలో చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి పి.తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల చెరువులు తీసుకునే వ్యాపారస్తులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2020 ప్రకారం లైసెన్స్ మంజూరు చేస్తుందని చెప్పారు. ఇ-మత్స్యకార్ లాగిన్‌లో గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఎకరాకి వెయ్యి రూపాయలు చొప్పున చెల్లించాలని, మండల సర్వేయర్ జారీ చేసిన ఆటోక్యాడ్ మ్యాప్, భూమి రెవెన్యూ అడంగల్, పట్టాదారు పాస్‌బుక్ లేదా లీజ్ అగ్రిమెంటు, పది రూపాయల బాండ్ పేపర్ పై 80 శాతం నికర చెరువు, 20శాతం గట్లు వేస్తానని హామీ ఇస్తూ అఫిడవిట్ ఉండాలని వివరించారు. అర్హత గల దరఖాస్తులకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ద్వారా లైసెన్స్ మంజూరు చేయనున్నట్లు వివరించారు.

బీఎస్సీ ఎంఎల్‌టీ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ ఎంఎల్‌టీ డిగ్రీ ఫలితాల్లో రాగోలు జెమ్స్ కళాశాల బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఈ ఫలితాల్లో మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ విభాగంలో టాప్–10 ర్యాంకుల్లో సెకెండియర్ విద్యార్థులు డి.చందు, కె.మాలతి, ఎస్.సి.అంజలి, జి.ప్రమీలా, ఎ.కుమారి సత్తాచాటారని పేర్కొన్నారు. ఫస్టియర్ విద్యార్థిని ఎస్.శృతి ప్రథమ ర్యాంకు సాధించిందని చెప్పారు. మెరుగైన బోధన, నిరంతర పర్యవేక్షణతోనే ఈ ఫలితాలు వచ్చాయని డాక్టర్ ఈ.గిరిధర్ పేర్కొన్నారు.

సాహిత్య పరిశోధకుడు ముత్యం చిరస్మరణీయుడు


ముత్యం సంస్మరణ సభలో మాట్లాడుతున్న అరసం ప్రతినిధులు

విజయనగరం టౌన్: కళింగాంధ్రా సాహిత్య పరిశోధనకు, శ్రీకాకుళం సాయుధ పోరాటాన్ని, ఆ పోరాటంలో పాల్గొన్న యోధుల చరిత్రను ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సేకరించి, పుస్తక రూపంలో తీసుకువచ్చిన ప్రముఖ రచయిత, కళింగాంధ్రా సాహిత్య పరిశోధకులు కె.ముత్యం చిరస్మరణీయుడని అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్.చలం పేర్కొన్నారు. గురజాడ స్వగృహంలో మంగళవారం రాత్రి ముత్యం సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగాంధ్రా చరిత్రకు ఎనలేని సేవలు చేసి, తన జీవితాన్ని కళింగాంధ్రకు అంకితం చేసిన మహానుభావుడని కీర్తించారు. అరసం ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణా బిడ్డగా జన్మించిన తన జీవితం చివరిబొట్టు వరకూ కళింగాంధ్రా చరిత్రను, ఆనాడు బ్రిటీష్ వారు సేకరించిన గ్రామాల చరిత్రను సేకరించి ఉత్తరాంధ్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, చీకటి దివాకర్, గురజాడ ఇందిర, డప్పు శ్రీను, స్వామి, పివిబి.శ్రీనివాస్, జివి.శ్రీనివాస్, జి.జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200